| నేటి మ్యాచ్‌లు | | | | |
|---|---|---|---|---|
| చెన్నై X ఢిల్లీ | మ.3.30 నుంచి | వేదిక చెన్నై | | |
| పంజాబ్ X రాజస్థాన్ | రా.7.30 నుంచి | వేదిక పంజాబ్ | | |

# ఫైనల్లో హితేశ్

వరల్డ్ బాక్సింగ్ కప్



న్యూఢిల్లీ: బ్రెజిల్ వేదికగా జరుగుతున్న ప్రతిష్ఠాత్మక వరల్డ్ బాక్సింగ్ కప్‌లో భారత యువ బాక్సర్ హితేశ్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. శుక్రవారం జరిగిన పురుషుల 70కిలోల సెమీస్ బౌట్‌లో హితేశ్ 5-0 తేడాతో మకాన్ ట్రారోరె (ఫ్రాన్స్)పై అద్భుత విజయం సాధించాడు. ఆది నుంచే ప్రత్యర్థిపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన హితేశ్.. పదునైన పంచ్‌లతో చెలరేగాడు. తద్వారా టైటిల్ పోరుకు అర్హత సాధించిన తొలి భారత బాక్సర్‌గా హితేశ్ నిలిచాడు. శనివారం జరిగే తుది పోరులో ఇంగ్లండ్ బాక్సర్ ఒడెల్ కమారతో హితేశ్ తలపడనున్నాడు. మరోవైపు 50కిలోల విభాగం సెమీస్‌లో జదుమణి సింగ్ 2-3తో అసిల్బెక్ జలీలోవ్ (ఉజ్బెకిస్థాన్) చేతిలో ఓడగా, విశాల్ (90కి), సచిన్ (60కి) పరాజయం పాలయ్యారు.

# రోహిత్‌కు గాయం



లక్నో: ముంబై ఇండియన్స్ స్టార్ క్రికెటర్ రోహిత్‌శర్మకు గాయమైంది. లక్నో సూపర్‌జెయింట్స్‌తో మ్యాచ్ కోసం సిద్ధమవుతున్న సమయంలో నెట్స్‌లో రోహిత్ గాయపడ్డాడు. బంతి మెకాలికి బలంగా తాకడంతో శుక్రవారం లక్నోతో మ్యాచ్‌కు రోహిత్ అందుబాటులో లేడని కెప్టెన్ హార్దిక్ పాండ్యా టాస్ సమయంలో పేర్కొన్నాడు. ఈ సీజన్‌లో మూడు మ్యాచ్‌లాడిన హిట్‌మ్యాన్ 0, 8, 13 పరుగులతో నిరాశపరిచాడు. మరోవైపు వెన్నెముక గాయం నుంచి కోలుకుంటున్న స్టార్ స్పీడ్‌స్టర్ జస్‌ప్రీత్ బుమ్రా త్వరలో జట్టులో చేరే అవకాశముందని పాండ్యా తెలిపాడు. ఆస్ట్రేలియాతో బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ సందర్భంగా గాయపడ్డ బుమ్రా.. ప్రస్తుతం బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో పునరావాసం పొందుతున్నాడు. ఇదిలా ఉంటే లక్నోతో మ్యాచ్ ద్వారా ముంబైకి 100వ మ్యాచ్ ఆడుతున్న సూర్యకుమార్‌యాదవ్.. టీమ్ మేనేజ్‌మెంట్ నుంచి ప్రత్యేక జెర్సీ అందుకున్నాడు.

# భారత్‌తో సిరీస్‌కు స్టోన్ దూరం!



లండన్: భారత్‌తో కీలకమైన టెస్టు సిరీస్‌కు ముందు ఇంగ్లండ్‌కు ఎదురుదెబ్బ తగిలింది. మోకాలి గాయం కారణంగా యువ పేసర్ ఒలీ స్టోన్.. టీమ్‌ఇండియాతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌కు దూరమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. అబుదాబిలో జరిగిన కౌంటీ ప్రిసీజన్ కోసం సిద్ధమవుతున్న స్టోన్ గాయం కారణంగా తప్పుకోవాల్సి వచ్చిందని ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు(ఈసీబీ) శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొంది. గాయం తీవ్రత తెలియాల్సి ఉందని, స్కానింగ్ పరీక్షల తర్వాత ఒక అంచనాకు వస్తామని ఈసీబీ తెలిపింది. పూర్తిగా కోలుకునేందుకు దాదాపు 14 వారాల సమయం పట్టే అవకాశమున్నట్లు ఇంగ్లండ్ క్రికెట్ వర్గాలు స్పష్టం చేశాయి. జూన్ 20 నుంచి హెడింగ్లే వేదికగా భారత్, ఇంగ్లండ్ మధ్య తొలి టెస్టు మొదలుకానుంది.



## గ్లోబల్ జావెలిన్ టోర్నీలో నీరజ్

న్యూఢిల్లీ: భారత్ వేదికగా త్వరలో జరిగే అంతర్జాతీయ జావెలిన్‌త్రో టోర్నీలో స్టార్ అథ్లెట్ నీరజ్ చోప్రా బరిలోకి దిగబోతున్నాడు. హర్యానాలోని పంచకులలో మే 24వ తేదీ నుంచి మొదలయ్యే గ్లోబల్ జావెలిన్ త్రో టోర్నీలో నీరజ్‌తో పాటు పలువురు ప్రముఖ అథ్లెట్లు పోటీపడనున్నారు. తావు దేవిలాల్ స్టేడియంలో జరిగే ఈ టోర్నీకి ఇప్పటికే ప్రపంచ అథ్లెటిక్స్ సమాఖ్య గవర్నింగ్ బాడీ క్యాటగిరీ-ఏ హోదా ఇచ్చింది. అయితే సమాఖ్య అధికారిక వెబ్‌సైట్‌లో మాత్రం దీన్ని ఇంకా పొందుపర్చాల్సి ఉంది. ఈ టోర్నీ ద్వారా భారత్ ప్రతిష్ఠాత్మక చాంపియన్‌షిప్‌లు నిర్వహించే సత్తాను ప్రదర్శించవచ్చని వరల్డ్ అథ్లెటిక్స్ అధ్యక్షుడు సెబాస్టియన్ కో పేర్కొన్నాడు. నిర్వాహక కమిటీలో సభ్యుడైన నీరజ్ చోప్రా..ఈ టోర్నీ భారత్‌కు రావడంలో కీలకంగా వ్యవహరించినట్లు తెలిపాడు. చోప్రా లాంటి ప్రముఖ అథ్లెట్‌తో పోటీపడటం ద్వారా యువ ప్లేయర్లలో ఆత్మవిశ్వాసం ప్రోది చేసినట్లు అవుతుందని ఏఎఫ్ఐ అధ్యక్షుడు బహదూర్‌సింగ్ అన్నాడు.

## ధోనీ కెప్టెన్సీలో..

చెన్నై: ఢిల్లీ క్యాపిటల్స్‌తో శనివారం జరిగే మ్యాచ్‌కు దిగ్గజ ప్లేయర్ మహేంద్రసింగ్ ధోనీ చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్‌గా వ్యవహరించే అవకాశం కనిపిస్తున్నది. రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో గాయపడ్డ రెగ్యులర్ కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ మ్యాచ్ సమయానికి ఫిట్‌నెస్ నిరూపించుకోకపోతే ధోనీ సారథ్య బాధ్యతలు అందుకునే చాన్స్ ఉంది. శుక్రవారం జరిగిన మీడియా భేటీలో చెన్నై బ్యాటింగ్ కోచ్ మైఖేల్ హస్సీ స్పందిస్తూ వికెట్ల వెనుక యువకునిలా కీపింగ్ చేస్తున్న వ్యక్తి అయితే బాగుంటుందని పేర్కొన్నాడు. ధోనీ, జడేజా తర్వాత.. రుతురాజ్ ప్రస్తుతం చెన్నై కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే.

# లక్నోదే లక్

ముంబైపై ఉత్కంఠ విజయం

మార్ష్, మార్క్‌రమ్ అర్ధసెంచరీలు

పాండ్యా ఐదు వికెట్ల ప్రదర్శన వృథా



పాండ్యా (5/36)

**1** ఐపీఎల్ చరిత్రలో ఐదు వికెట్లు తీసిన తొలి కెప్టెన్‌గా హార్దిక్ పాండ్యా నిలిచాడు.

**పాయింట్ల పట్టిక**

| జ | మ్యా | గె | ఓ | పా | ర.రే |
|---|---|---|---|---|---|
| పంజాబ్ | 2 | 2 | 0 | 4 | 1.48 |
| ఢిల్లీ | 2 | 2 | 0 | 4 | 1.32 |
| బెంగళూరు | 3 | 2 | 1 | 4 | 1.14 |
| గుజరాత్ | 3 | 2 | 1 | 4 | 0.80 |
| కోల్‌కతా | 4 | 2 | 2 | 4 | 0.07 |
| లక్నో | 4 | 2 | 2 | 4 | 0.04 |
| ముంబై | 4 | 1 | 3 | 2 | 0.10 |
| చెన్నై | 3 | 1 | 2 | 2 | -0.77 |
| రాజస్థాన్ | 3 | 1 | 2 | 2 | -1.11 |
| హైదరాబాద్ | 4 | 1 | 3 | 2 | -1.61 |

నోట్: జ- జట్టు, మ్యా. మ్యాచ్, గె-గెలుపు, ఓ-ఓటమి, పా-పాయింట్లు, ర.రే-రన్‌రేట్

ముంబై: ఐపీఎల్‌లో మరోపోరు అభిమానులను అలరించింది. శుక్రవారం ఆఖరి వరకు నువ్వానేనా అన్నట్లు సాగిన మ్యాచ్‌లో లక్నో సూపర్‌జెయింట్స్ 12 పరుగుల తేడాతో ముంబై ఇండియన్స్‌పై విజయం సాధించింది. గెలుపు దోబూచులాడిన మ్యాచ్‌లో చివరికి లక్నోనే లక్ వరించింది. తొలుత లక్నో నిర్ణీత 20 ఓవర్లలో 203/8 స్కోరు చేసింది. ఓపెనర్లు మిచెల్ మార్ష్(31 బంతుల్లో 60, 9ఫోర్లు, 2సిక్స్‌లు), మార్క్‌రమ్(38 బంతుల్లో 53, 2ఫోర్లు, 4సిక్స్‌లు) అర్ధసెంచరీలతో అదరగొట్టారు. కెప్టెన్ హార్దిక్ పాండ్యా(5/36) ఐదు వికెట్లతో విజృంభించాడు. ఐపీఎల్‌లో ఐదు వికెట్లు తీసిన తొలి కెప్టెన్‌గా హార్దిక్ కొత్త రికార్డు నెలకొల్పాడు. లక్ష్యఛేదనకు దిగిన ముంబై 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 191 పరుగులకు పరిమితమైంది. సూర్యకుమార్‌యాదవ్(43 బంతుల్లో 67, 9ఫోర్లు, సిక్స్), నమన్ ధీర్(24 బంతుల్లో 46, 4ఫోర్లు, 3సిక్స్‌లు) రాణించారు. శార్దుల్, ఆకాశ్, అవేశ్, దిగ్వేశ్ ఒక్కో వికెట్ తీశారు. దిగ్వేశ్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

**ఆఖర్లో అద్భుతం:**

204 పరుగుల లక్ష్యఛేదనలో ముంబైకి ఆదిలో ఎదురుదెబ్బ తగిలింది. ఓపెనర్లు విల్ జాక్స్(5), రికల్టన్(10) ఘోరంగా విఫలమయ్యారు. ఈ తరుణంలో నమన్‌ధీర్, సూర్యకుమార్ ఇన్నింగ్స్ బాధ్యతను తీసుకున్నారు. వీరిద్దరు పసలేని లక్నో బౌలింగ్‌ను అలవోకగా ఎదుర్కొంటూ పరుగులు సాధించారు. నమన్‌ధీర్ అయితే కొడితే ఫోర్ లేదంటే సిక్స్ అన్న తరహాలో వీరవిహారం చేశాడు. బౌలింగ్ మార్పుగా వచ్చిన దిగ్వేశ్.. నమన్‌ను ఔట్ చేయడంతో ముంబై తడబడింది. అయితే సూర్యకుమార్ ఇన్నింగ్స్‌కు ఇరుసులా నిలిచాడు. తిలక్‌వర్మ(25 రిటైర్డ్ ఔట్) అండతో సూర్యకుమార్ లక్నో బౌలర్ల భరతం పట్టాడు. తనదైన శైలిలో షాట్లు ఆడుతూ లక్ష్యాన్ని అంతకంతకూ కరిగించాడు. తన ఇన్నింగ్స్‌లో 9ఫోర్లు, సిక్స్ కొట్టిన సూర్యకుమార్.. అవేశ్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. అయితే 19వ ఓవర్‌లో తిలక్‌ను రిటైర్డ్ ఔట్‌గా రప్పించిన ముంబై.. సాంట్నర్(2 నాటౌట్)కు చాన్స్ ఇచ్చింది. కానీ ఆఖర్లో అవేశ్ అద్భుతం చేశాడు. ఆరు బంతుల్లో 22 పరుగులు చేయాల్సిన దశలో 9 పరుగులు ఇచ్చిన అవేశ్..లక్నోకు అద్భుత విజయాన్ని కట్టబెట్టాడు.

**పాండ్యా పటాకా:**

మొదట టాస్ గెలిచిన ముంబై ఇండియన్స్..లక్నోను బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. ఓపెనర్లు మిచెల్ మార్ష్, ఎడెన్ మార్క్‌రమ్ లక్నోకు మెరుగైన శుభారంభాన్ని అందించారు. సొంతగడ్డపై పరిస్థితులను అనుకూలంగా మలుచుకుంటూ వీరిద్దరు ఆది నుంచే ముంబై బౌలర్లను లక్ష్యంగా చేసుకున్నారు. బౌల్ట్ వేసిన ఇన్నింగ్స్ తొలి ఓవర్ నాలుగో బంతికి మార్ష్ ఔటయ్యే ప్రమాదం నుంచి బయటపడ్డాడు. బ్యాట్‌కు తాకినట్లు రిప్లేలో స్పష్టంగా కనిపించినా..ముంబై డీఆర్ఎస్‌కు వెళ్లకపోవడం మార్ష్‌కు కలిసివచ్చింది. ఇదే అదనుగా దీపక్ చాహర్ రెండో ఓవర్‌లో మార్క్‌రమ్ ఫోర్ కొడితే..మార్ష్ రెండు ఫోర్లతో చెలరేగాడు. వీరి దూకుడైన బ్యాటింగ్‌తో స్కోరుబోర్డు ఊపందుకుంది. అశ్వనీ కుమార్ 6వ ఓవర్‌లో సిక్స్, ఫోర్‌తో మార్ష్ 27 బంతుల్లో అర్ధసెంచరీ మార్క్ అందుకున్నాడు. దీంతో పవర్ ప్లే ముగిసే సరికి లక్నో వికెట్ నష్టపోకుండా 69 పరుగులు చేసింది. ఇక లాభం లేదనుకుని యువ స్పిన్నర్ విఘ్నేశ్ పుతుర్‌ను తీసుకురావడం ముంబైకి కలిసొచ్చింది. డ్రైవ్ ఆడబోయిన మార్ష్..విఘ్నేశ్‌కే రిటర్న్ క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. దీంతో తొలి వికెట్‌కు 76 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. మార్ష్ స్థానంలో క్రీజులోకి వచ్చిన పూరన్(12) సిక్స్, ఫోర్‌తో జోరు ప్రదర్శించాడు. 9వ ఓవర్‌లో బౌలింగ్‌కు వచ్చిన కెప్టెన్ హార్దిక్ పాండ్యా..పూరన్‌ను బోల్తా కొట్టించాడు. స్లో బౌన్సర్‌ను ఆడే క్రమంలో చాహర్ చేతికి చిక్కాడు. ఇప్పుడు ఇక తన వంతు అంటూ కెప్టెన్ పంత్(2)..పాండ్యాకు వికెట్ ఇచ్చుకున్నాడు. ఈ క్రమంలో మార్క్‌రమ్, ఆయూశ్ బదోని(30) ఇన్నింగ్స్ చక్కదిద్దే బాధ్యతను తీసుకున్నారు. మార్క్‌రమ్ సహకారంతో బదోనీ బౌండరీలతో చెలరేగడంతో 14వ ఓవర్‌లో 15 పరుగులు వచ్చాయి. అశ్వని బౌలింగ్‌లో బదోని ఔట్ కాగా, అర్ధసెంచరీ పూర్తి చేసుకున్న మార్క్‌రమ్..హార్దిక్‌కు వికెట్ ఇచ్చుకున్నాడు. ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్‌కు దిగిన హార్దిక్ వరుస బంతుల్లో మిల్లర్(27), ఆకాశ్‌దీప్(0)ను ఔట్ చేశాడు. మధ్యలో ఒకింత నెమ్మదించిన లక్నో ఇన్నింగ్స్...మార్క్‌రమ్, బదోనీ, మిల్లర్ ఇన్నింగ్స్‌తో 200 పరుగుల మార్క్ అందుకుంది.



మార్ష్ (60)

**సంక్షిప్త స్కోర్లు**

లక్నో: 20 ఓవర్లలో 203/8(మార్ష్ 60, మార్క్‌రమ్ 53, పాండ్యా 5/36, బౌల్ట్ 1/28), ముంబై: 20 ఓవర్లలో 191/5(సూర్యకుమార్ 67, నమన్ 46, దిగ్వేశ్ 1/21, శార్దుల్ 1/40)

# రహానే కిట్‌బ్యాగ్ తన్నినందుకే!

- ముంబైని జైస్వాల్ వీడినట్లు వార్తలు



ముంబై: దేశవాళీ దిగ్గజం ముంబై జట్టును యువ క్రికెటర్ యశస్వి జైస్వాల్ వీడటం ఈ మధ్య వార్తల్లో ప్రముఖంగా నిలిచింది. స్టార్ క్రికెటర్లతో కూడిన ముంబై జట్టుకు ఆడటమనేది ప్రతీ ఒక్క ప్లేయర్ కల. అలాంటిది అనూహ్యంగా ముంబైని జైస్వాల్ వీడటంపై ఒక ఆసక్తికర వార్త వెలుగులోకి వచ్చింది. ఈ మధ్యే ముగిసిన రంజీ టోర్నీలో జమ్ముకశ్మీర్‌తో మ్యాచ్ సందర్భంగా ముంబై కెప్టెన్ రహానే, జైస్వాల్ మధ్య విభేదాలు ఏర్పడినట్లు తెలిసింది. కోపంతో రహానే కిట్‌బ్యాగ్‌ను తన్నడంపై ముంబై టీమ్ మేనేజ్‌మెంట్ జైస్వాల్‌ను వివరణ అడిగినట్లు వినికిడి. క్షమాపణ చెప్పేందుకు అంగీకరించని జైస్వాల్..రానున్న రంజీ సీజన్‌లో ముంబై నుంచి గోవాకు మారేందుకు కారణమైందని బయటపడింది. గోవా తనకు కెప్టెన్సీ అవకాశమిస్తున్నదని జైస్వాల్ చెబుతున్నప్పటికీ రహానేతో గొడవ దీనికి కారణమని ముంబై క్రికెట్ వర్గాల్లో ప్రచారం జరుగుతున్నది.

## చైన్‌సింగ్‌కు కాంస్యం

న్యూఢిల్లీ: బ్యూనస్‌ఎయిర్స్(అర్జెంటీనా) వేదికగా జరుగుతున్న ఐఎస్ఎస్ఎఫ్ షూటింగ్ ప్రపంచకప్‌లో భారత్‌కు తొలి పతకం దక్కింది. శుక్రవారం జరిగిన పురుషుల 50మీటర్ల రైఫిల్-3 పొజిషన్ విభాగంలో భారత యువ షూటర్ చైన్‌సింగ్(443.7) కాంస్య పతకంతో మెరిశాడు. ఇస్త్వాన్ పెని(461.0), తియాన్ జియిమింగ్ (458.8) వరుసగా స్వర్ణ, రజత పతకాలు కైవసం చేసుకున్నారు. గత మూడేండ్ల వ్యవధిలో చైన్‌కు ఇది తొలి పతకం.

## ధాన్యం కొనుగోళ్ల కోసం రోడ్డెక్కిన రైతులు

**మిల్లర్లు గేట్లు బంద్ చేయడంతో నల్లగొండ జిల్లాలో రాస్తారోకో**

వేములపల్లి, ఏప్రిల్ 4 : ధాన్యం కొనుగోలు చేయకుండా మిలర్లు ఇబ్బందులు పెడుతుండడంతో విసుగెత్తిన రైతులు ఆందోళనకు దిగారు. నల్లగొండ జిల్లా శెట్టిపాలెం రాస్తారోకో చేశారు. వేములపల్లి మండలం శెట్టిపాలెం సమీపంలో 18 మిల్లులు ఉన్నాయి. మిల్లు గేట్లు మూసి పెడుతుండడంతో ధాన్యం లోడ్లతో వచ్చిన రైతులు ఎక్కడ అమ్ముకోవాలో తెలియక అవస్థ పడుతున్నారు. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇలా అనేక ట్రాక్టర్లు మిల్లుల ఎదుట బారులు తీరాయి. అధికారులు పత్తా లేరు. మిలర్లను అడిగితే నిర్లక్ష్యంగా బదులిస్తున్నట్లు రైతులు వాపోతున్నారు. దీంతో సాయంత్రం ఆరు గంటల సమయంలో మహాతేజ మిల్లు ఎదుట అద్దంకి-నార్కెట్‌పల్లి హైవేపై ధాన్యం ట్రాక్టర్లతో రైతులు రాస్తారోకోకు దిగారు. ధాన్యం కొనుగోలు చేసేవరకూ ఆందోళన విరమించేది లేదని బైఠాయించారు. హామీనిచ్చి ఆందోళన విరమింపచేశారు.

## సన్నబియ్యం పంపిణీలో అవకతవకలు రావొద్దు

**వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి ఉత్తమ్ ఆదేశాలు**

హైదరాబాద్, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ) : సన్నబియ్యం పంపిణీలో అవకతవకలు జరగకుండా చూడాలని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో మంత్రులు, సీఎస్‌తో కలిసి కలెక్టర్లు, ప్రజాప్రతినిధులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న నిరుపేదలందరికీ పూర్తి స్థాయిలో ఆహార భద్రత కల్పించేందుకే సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. సన్నబియ్యం పంపిణీని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ప్రజాప్రతినిధులంతా చౌకధరల దుకాణాలను సందర్శించాలని కోరారు. సన్నబియ్యం సరఫరాకు సరిపడా రవాణా వసతి కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, పలువురు ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు పాల్గొన్నారు.

# సన్నాల ధర ధమాల్



మిర్యాలగూడ శివారులో ఉన్న రైస్ మిల్లుల్లో ఆంధ్రా నుంచి వచ్చిన ధాన్యం లారీలు

మొదటిపేజీ తరువాయి...

ఆయకట్టుతోపాటు బోరుబావుల కింద సాగు చేసిన రైతులు ప్రస్తుతం వరి కోతలు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. మిర్యాలగూడ పరిసర ప్రాంతాల రైస్ మిల్లుల్లో ధాన్యాన్ని విక్రయించుకునేందుకు ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి నిత్యం వందలాది ట్రాక్టర్లు వస్తున్నాయి. ధాన్యం ట్రాక్టర్లు రాక ఎక్కువగా ఉంటే రైస్‌మిల్లర్లు వాట్సాప్ ద్వారానే సంకేతాలు ఇచ్చుకొని ఆరోజు ఏ ధరకు కొనుగోలు చేయాలనేది నిర్ధారించుకొని సిండికేట్‌గా మారి రైతులను దోచుకుంటున్నారు. హెచ్‌ఎంటీ రకం ధాన్యాన్ని రూ.2,100 నుంచి రూ.2,200 వరకే కొనుగోలు చేస్తున్నారు. ధర పెంచాలని రైతులు అడిగితే "పచ్చగింజ ఉంది.. మాకు అవసరం లేదు.. ఇష్టం ఉన్న చోట అమ్ముకోండి" అంటూ దబాయిస్తున్నారు. దీంతో రైతులు దిక్కుతోచని పరిస్థితుల్లో మిలర్లు అడిగిన ధరకే ధాన్యాన్ని అప్పజెప్పి వెళ్తున్నారు. మిల్లర్లు సిండికేట్‌గా మారడంతో తాము ధాన్యాన్ని ఎన్ని మిల్లుల వద్దకు తీసుకెళ్లినా సరైన ధరకు అమ్ముకునే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. మిలర్లు సిండికేటయి ధర తక్కువ నిర్ణయిస్తున్నారని ఫిర్యాదు చేసేందుకు సబ్‌కలెక్టర్‌కు ఫోన్ చేసినా పట్టించుకోవడంలేదని ఓ రైతు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో అధికారులు వెంటనే స్పందించే వారని, ఇప్పుడు ఆ పరిస్థితిలేదని విలపిస్తున్నారు.

**వారంలోనే పడిపోయిన ధర**

వారం క్రితం మిర్యాలగూడ పరిసర ప్రాంతాల రైస్ మిల్లుల్లో కావేరి చింట్లు, హెచ్‌ఎంటీ రకాల ధాన్యానికి రూ.2,400 నుంచి రూ.2,500 వరకు ధర పెట్టి కొనుగోలు చేశారు. ఎప్పుడైతే వరి కోతలు ఊపందుకుని ధాన్యం అత్యధికంగా రావడం మొదలైందో అప్పటి నుంచే మిలర్లు ధరలను తగ్గించారు. క్వింటాకు రూ.2,100 నుంచి రూ.2,200కి ధర మాత్రమే చెప్తున్నారు.

**ఆంధ్రా ధాన్యం జోరుగా కొనుగోలు**

ఒకవైపు నాగార్జునసాగర్ ఆయకట్టు నుంచి ధాన్యం పెద్దఎత్తున వస్తున్నా రైస్ మిల్లర్లు మాత్రం ఆంధ్రా ధాన్యాన్ని అధికంగా కొనుగోలు చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల, కర్నూలు జిల్లాల నుంచి సన్నధాన్యం లారీల ద్వారా నల్లగొండ జిల్లాలోని రైస్‌మిల్లులకు వస్తున్నది. ఆంధ్రా నుంచి వస్తున్న ధాన్యం తక్కువ ధరకే ఇస్తుండడంతో మిల్లర్లు వాటిని కొనుగోలు చేస్తూ.. సాగర్ ఆయకట్టు ప్రాంతాల రైతుల ధాన్యాన్ని కూడా అదే ధరకు అడుగుతున్నారు. అధికారులు పట్టించుకోకపోవడం వల్లే బయటి ధాన్యాన్ని కొనుగోలు చేస్తూ స్థానిక రైతులను అన్యాయం చేస్తున్నారని అన్నదాతలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

**అధికారుల పర్యవేక్షణ కరువు.**

గతంలో బీఆర్ఎస్ హయాంలో ఏటా ధాన్యం కోతలు ప్రారంభం కాగానే మిర్యాలగూడ రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉన్న రైస్‌మిల్లర్లతో ఆర్డీవో సమావేశం నిర్వహించేవారు. రైతులకు సరైన ధర ఇవ్వాలని దిశానిర్దేశం చేసేవారు. స్థానిక ఎమ్మెల్యే కూడా సమావేశం నిర్వహించి రైతులను ఇబ్బందులు పెట్టవద్దని చెప్పుండేవారు. ప్రస్తుతం వరి కోతలు ప్రారంభమై 15 రోజులు దాటినా ఇంతవరకు రైస్‌మిల్లర్లతో అధికారులు సమావేశం నిర్వహించలేదు. ఈ నేపథ్యంలో రైస్ మిల్లర్లు కనీస మద్దతు ధర కూడా ఇవ్వడంలేదు. ఇకనైనా అధికారులు మిల్‌పాయింట్ల వద్దకు వచ్చి ధాన్యానికి మద్దతు ధర అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

**క్వింటా రూ.2,150కే కొన్నారు**

నేను మూడెకరాల్లో పండించిన హెచ్‌ఎంటీ రకం సన్న ధాన్యాన్ని మిర్యాలగూడలోని రైస్ మిల్లులకు తీసుకొచ్చాను. ఎన్ని మిల్లులకు తిరిగినా రూ.2,150లోపే ధర అడిగారు. చేసేది లేక అదే ధరకు అమ్ముకున్నా. ఏడాది క్రితం ఇంతే నాణ్యతతో ఉన్న ఇదే రకం ధాన్యాన్ని రూ.2,350కు అమ్మాను. రైతులు నష్టపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

– సత్యంరెడ్డి, రైతు, ఇసుకబావిగూడెం

# సన్నబియ్యం.. నో స్టాక్!

మొదటిపేజీ తరువాయి...

అధికారులు తొలి విడతగా రేషన్‌షాప్‌లకు 50% బియ్యాన్ని అలాట్ చేశారు. అది కూడా అయిపోవడంతో చాలామంది డీలర్లు రేషన్‌షాపులను మూసివేశారు. మంచిర్యాల పట్టణంలో మొత్తం 142 షాపులు ఉండగా, 1,530.33 టన్నుల బియ్యం అవసరం కాగా, 50% కోటానే షాపులకు పంపించారు. శుక్రవారం 47 షాపులకు 100% బియ్యం సరఫరా చేయగా, మరో 95 షాపులకు 593.561 టన్నుల బియ్యాన్ని పంపించాల్సి ఉన్నది. నిర్మల్ జిల్లా కేంద్రంలోని గొల్లపేట కాలనీలో ఉన్న 32వ రేషన్ దుకాణంలో సన్న బియ్యం కోసం వచ్చిన మహిళలు రేషన్ లేకపోవడంతో వెనుదిరిగి పోయారు. పెద్దపల్లి జిల్లా రామగుండం, గోదావరిఖనిలో స్టాక్ లేకపోవడంతో రేషన్ డీలర్లు దుకాణాలు మూసివేశారు. దీనిపై తహసీల్దార్ కుమారస్వామిని వివరణ కోరగా, తమకు వచ్చిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 4 నుంచి సన్నబియ్యం పంపిణీ ప్రారంభిస్తామని చెప్పారు. కానీ, శుక్రవారం కూడా గోదావరిఖనిలోని పలు డివిజన్లలో రేషన్ దుకాణాలు మూసే ఉన్నాయి. బెల్లంపల్లిలోని 23వ రేషన్ దుకాణంలో ఎమ్మెల్యే గడ్డం వినోద్ సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించగా, శుక్రవారం ఉదయానికే స్టాక్ అయిపోయినట్టు సదరు డీలర్ చెప్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మొదటిరోజు రేషన్ షాపులకు 50% స్టాక్ మాత్రమే చేరింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంతోపాటు అన్నపురెడ్డిపల్లి మండలంలోని నాలుగు గ్రామాల్లో బియ్యం పంపిణీ చేపట్టలేదు. చంద్రుగొండ మండలంలో తొలిరోజు బియ్యం పంపిణీ చేసినప్పటికీ, ఆ తరువాత రెండు రోజులపాటు హమాలీల సమ్మె వల్ల బియ్యం డీలర్లకు చేరలేదు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 5,480 టన్నుల బియ్యం అవసరం కాగా, 4,700 టన్నుల బియ్యం తోలకం పూర్తి చేసినట్టు సివిల్ సప్లై డీఎం త్రినాథ్‌బాబు చెప్పారు. ఖమ్మం జిల్లాలోని 748 రేషన్ దుకాణాల ద్వారా 7,231 టన్నుల బియ్యం పంపిణీ చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు 3,661 టన్నులు మాత్రమే రేషన్ దుకాణాలకు సరఫరా చేశారు.




మంచిర్యాల పట్టణంలోని జాఫర్‌నగర్‌లో బియ్యం స్టాక్ లేక మూసి ఉన్న రేషన్‌షాపు



హరిప్రసాద్ నేసిన చీర

# భద్రాద్రి సీతమ్మకు సిరిసిల్ల చీర

బంగారు పట్టు చీర నేసిన హరిప్రసాద్

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 4: శ్రీరామనవమిని పురస్కరించుకుని భద్రాద్రి సీతారాముల కల్యాణ వేడుకల కోసం సిరిసిల్లకు చెందిన నేత కార్మికుడు వెల్ది హరిప్రసాద్ చేనేత మగ్గంపై బంగారు పట్టు చీరను నేశాడు. వన్ గ్రాంగోల్డ్ జరీ పట్టు దారంతో ఏడు గజాల చీరను 800 గ్రాముల బరువులో ఉండేలా తయారు చేశాడు. చీర కొంగులో భద్రాద్రి ఆలయ మూల విరాట్ దేవతామూర్తులు, బార్డర్‌లో శంకు చక్రనామాలు, హనుమంతుడు, గరత్మంతుడు, శ్రీరామ నామాలను ఉండేలా నేశాడు. శనివారం భద్రాద్రికి వెళ్లి, ఈ చీరను ప్రభుత్వం కొనుగోలు చేసి దేవాదాయ శాఖకు అందించాలని కోరుతానని హరిప్రసాద్ తెలిపాడు.



వరంగల్ జిల్లా రాయపర్తి ఎస్‌బీఐకి తాళాలేసి ఆందోళన చేస్తున్న బాధితులు

# బ్యాంకు ఎదుట బంగారం బాధితుల ఆందోళన

**బ్యాంకుకు తాళం వేసి కార్యకలాపాల నిలిపివేత**

రాయపర్తి, ఏప్రిల్ 4: వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు బంగారం బాధితులు శుక్రవారం తాళాలు వేసి బ్యాంకు కార్యకలాపాలను అడ్డుకొని ఆందోళన చేపట్టారు. బ్యాంకు ఎదుట బైఠాయించిన ఆందోళన చేసిన పోనుగోటి వెంకటేశ్వర్‌రావు, ముద్రబోయిన సుధాకర్, అఖిల్, గిరుక రాజయ్య, గుగులోత్ భద్రమ్మ, మహ్మద్ సుల్తానా, షకీల్, సరికొండ సంతోష్‌కుమార్, మమత మాట్లాడుతూ.. రాయపర్తి మండలంలోని రాయపర్తి, మైలారం, రాగన్నగూడం, మహబూబ్‌నగర్, పెర్కవేడు, బాలాజీతండా, ఊకల్‌కు చెందిన సుమారు 650మంది బ్యాంకులో బంగారు ఆభరణాలను తాకట్టు పెట్టి రుణాలను తీసుకున్నట్టు వివరించారు. గతేడాది నవంబర్ 19న బ్యాంకులో దొంగలు పడి 20 కిలోల బంగారాన్ని దోచుకెళ్లినట్టు చెప్పారు. తాము బ్యాంకుకు చెల్లించాల్సిన అప్పులు చెల్లిస్తామని, బంగారం ఇవ్వాలని అడుగుతుంటే ఎలాంటి సమాధానం చెప్పకుండా పోలీసులతో బయటకు గెంటివేయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బంగారం బాధితులు, ఆందోళన చేస్తున్న వారికి బ్యాంకు మేనేజర్ మాడిశెట్టి సత్యనారాయణ నచ్చజెప్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వర్తిస్తున్న విశ్రాంత ఆర్మీ జవాన్ ప్రభాకర్ తానే పెద్ద ఆఫీసర్‌ను అనే ధోరణిలో మహిళలు, నిరక్షరాస్యులు, గ్రామీణ ప్రాంత వ్యక్తులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాడని ఖాతాదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.